నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

అనుమతులు ఒకలా...నిర్మాణాలు మరోలా..!

- గృహాల పేరిట వ్యాపార సముదాయం నిర్మాణం
-అస్తవ్యస్తంగా టౌన్ ప్లానింగ్ విభాగం

చెరువు సమీపాన అనుమతులు ఇవ్వని చోట భవన నిర్మాణం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

బి.కొత్తకోట పట్టణంలో కొన్నింటి గృహాలకు అనుమతులు ఒకలా తీసుకొని నిర్మాణాలు మరొకలా చేపడుతున్నారు. ఇంటి నిర్మాణాల పేరుతో అనుమతులు తీసుకొని వ్యాపార సముదాయాలను నిర్మించేస్తున్నారు. ఇలాంటి వాటిని నిర్మూలించాల్సిన అధికారులే అడ్డదారిన ఆక్రమాల ప్లానింగులకు అనుమతులు ఇస్తుండడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బి.కొత్తకోట పంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీగా రూపాంతరం చెందింది. దశబ్ద కాలం నుంచి పట్టణం ప్రాంతం పెరుగుతుండడంతో నిర్మాణాలు పెరిగాయి. ఇదే సమయంలో కొందరు నిర్మాణాలలో ఆక్రమాలకు తెరలేపారు. కళ్ల ఎదుటే వ్యాపార భవన సముదాయాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రెండేళ్ల కిందట ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకొని వ్యాపార సదుపాయాలకు భవనాలు నిర్మిస్తున్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ విభాగం ఏమి ఎరుగనట్లు వ్యవహరించడం చర్చనీయాంశమైంది. అనుమతులు లేకుండా పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వ పాలనలో అక్రమ నిర్మాణాలు అనుమతి లేని నిర్మాణాలు విచ్చలవిడిగా జరిగాయని విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ దీనికి కొనసాగింపుగా నిర్మాణాలు జరుగుతుండడం గమనార్హం.

యథేచ్ఛగా వ్యాపార భవన సముదాయాల నిర్మాణం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం వైసిపి పాలనలో ఆగిన నిర్మాణ పనులను భవన యజమానులు మళ్లీ ప్రారంభించారు. బి.కొత్తకోట పట్టణంలోని ద్వారకనాథ్ థియేటర్ వెనుకవైపు ఈ నిర్మాణ అనుమతులు, చెరువుకు సమీపంలోని వంద మీటర్లలోపు భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించారు. కానీ ఇప్పుడు మళ్లీ నిర్మాణాలు చేపట్టడంపై పలువురు చర్చించుకుంటున్నారు. అనుమతులు ఇంటి నిర్మాణానికి తీసుకొని భవన సముదాయాలు నిర్మిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో నగర పంచాయతీ ఆదాయానికి గండి పడింది. ఇదొక్కటే కాదు పట్టణంలో ఎక్కడ చూసినా అనధికారిక భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇష్టారాజ్యాంగా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాలు వైపు కన్నెత్తిచూసిన దాఖలాలే లేవు. అలాగే పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ సమీపాన నగర పంచాయతీకి చెందిన షాపు రూములు నెలసరి బాడుగలు సైతం వసూలు చేసేందుకు అధికారులకు సమయం ఉండడం లేదు. నెలలు తరబడి కొన్ని సంవత్సరాలుగా బాడుగలు బకాయిలు ఉండిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దుకాణ రుములను ష్యూరిటీ పెట్టి వాటిని జప్తు చేసి, గడువు పూర్తి అయిన వాటికి మళ్లీ వేలం పాట నిర్వహించి పంచాయతీకి ఆదాయం వచ్చేలా కృషి చేయాల్సిన అవసరముంది.

హద్దులు దాటి రోడ్డుపై నిర్మించిన భవనం

పేదల నిర్మాణాలకు మాత్రమే అడ్డంకులు

బడా బాబులు నిర్మాణాలు పట్టించుకోని అధికారులు నిరుపేద, మధ్యతరగతి ప్రజలు మరుగుదొడ్డి నిర్మిస్తే వెంటనే వచ్చి వాలిపోతున్నారు. నిబంధనకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారంటూ పేదలను ప్రశ్నిస్తారు. నిరుపేద ప్రజలు ఇంటి పన్నులపై నీటి, ఆస్తి పన్నుల కోసం నోటీసులు ఇస్తూ నిరుపేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న నగర పంచాయతీ అధికారులకు మురికి కాలువలకు బ్లీజింగ్ పౌడర్ గాని,శానిటైజింగ్ గాని చేసి ప్రజలు రోగాల బారిన పడకుండా చేద్దామన్న చిత్తశుద్ధి లేదని పలువురు విమర్శిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెండు, మూడు అంతస్తులు భవనాలు నిర్మిస్తున్నా ఎందుకు స్పందించటలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇన్‌ఛార్జులతో టౌన్ ప్లానింగ్ విభాగం

బి.కొత్తకోట పంచాయతీ నుంచి నగర పంచాయతీ అయ్యింది. పేరుకు నగర పంచాయతీ అయినా టౌన్ ప్లానింగ్ విభాగం అస్తవ్యస్తంగా తయారైంది.ఆ విభాగంలో పూర్తిస్థాయిలో అధికారులు లేరు. గతంలో డిప్యూటేషనుపై ఇద్దరు ఇన్‌ఛార్జులు టౌన్ ప్లానింగ్ అధికారులు ఉండేవారు. వారు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండేవారని పలువురు ఫిర్యాదు చేయడంతో వారు వేరే స్థానాలకు వెళ్లిపోయారు. అప్పటినుంచి బి.కొత్తకోట నగర పంచాయతీకి టౌన్ ప్లానింగ్ అధికారులు లేరు.

అస్తవ్యస్తంగా బి.కొత్తకోట నగర పంచాయతీ

బి.కొత్తకోట నగర పంచాయతీ అయిన్పటికీ వసతులు కల్పన లేదు. ప్రజలపై పన్నుల భారం మోపి ఆదాయ వనరులు మాత్రం పెంచారు. ఏడాదికి రూ. 60 లక్షలు నుంచి ప్రస్తుతం ఒకటిన్నర కోటి ఆదాయం వచ్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. నగర పంచాయతీకి ప్రస్తుతం ఆరు నెలలకు ఒకసారి ప్రజలపై పన్నులు మోపడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ, తాగునీరు, రోడ్లు, కనీస వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

పట్టణంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతుంటే చర్యలు తీసుకుంటాం. ఇంటి నిర్మాణాలకు అనుమతులు తీసుకొని వ్యాపార భవనాలు సముదాయాలు నిర్మించరాదు. నివాస ప్రాంతాల్లో భవన నిర్మాణం ఉంటే వాటికి పన్నులను విధిస్తాం. అనుమతులు లేకుండా నిర్మాణాలు ఉంటే నిబంధనల మేరకు కూల్చివేస్తాం.

-జి.వి పల్లవి, నగర పంచాయతీ కమిషనర్

బుద్ధుడి విగ్రహం తల నరికిన
నిందితులపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

- 28న దక్షిణాది రాష్ట్రాల జైల్ భరో
- ప్రజాసంఘాల పిలుపు

ప్రజాశక్తి - రాయచోటి

గౌతమ బుద్ధుడి విగ్రహం తల నరికిన ఉన్మాద దుర్ఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి నిందితులపై దేశ ద్రోహం నమోదు చేయాలని, బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయించిన ఎస్పి విద్యాసాగర్ నాయుడు పై అట్రాసిటీ కేసు నమోదు సస్పెండ్ చేయాలని ప్రజా సంఘ నాయకులు డిమాండ్ చేశారు. అదివారం పట్టణంలో సిపిఐ కార్యాలయంలో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు అధ్యక్షతన పలు ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యదర్శి టి .ఈశ్వర్,పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రవిశంకర్ ,భారతీయ అంబేద్కర్ సేన కేంద్ర కమిటీ సభ్యులు కె. వి రమణ, బహుజన సేన వ్యవస్థాపకులు చందు లు మాట్లాడుతూ మదనపల్లి మండలం అంకి శెట్టిపల్లి గ్రామంలో ఉన్న బుద్ధుని కొండపై ఇటీవల గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాద ఉద్ఘటనపై సకాలంలో మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకట రమణ నిర్వాహకుల ఫిర్యాదు స్వీకరించకుండా కేసును నీరుగాచేందుకు ప్రయత్నించారని తెలిపారు. నేపథ్యంలో బుద్ధ అంబేద్కర్ సమాజ్ ఫౌండర్ పిటిఎం శివప్రసాద్, బౌద్ధులు శాంతియుతంగా దమ్మ దీక్ష చేస్తుండడంతో ఎస్పి అప్రజా స్వామికంగా వ్యవహరించి బుద్ధుని తల నరికి, తల -మొండెం వేరు చేసిన మతోన్మాదుల్ని గుర్తించి, అరెస్టు చేయకుండా శాంతియుతంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ముందు దీక్ష చేస్తున్న వారిని అరెస్టు చేయడం దారుణమని వాపోయారు. పోలీసులు శివప్రసాద్‌ని రిక్వెస్ట్ మీద వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ నిర్బంధించి దురుసుగా ప్రవర్తించారని చెప్పారు. ఆయనకు అస్వస్థతకు లోనై గుండెపోటు రావడంతో కనికరం కూడా లేకుండా వారిపై ఎస్పి ఆదేశాలతో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం అప్రజాస్వామీక చర్య అని వీరు ఆగ్రహం వ్యక్తం చేశారు. .భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య మాట్లాడుతూ ఈనెల 28న మదనపల్లి పట్టణంలో జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని ప్రజాస్వామిక వాదులు , బహుజన వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు వంగిమల్ల రమణ,లాయర్ రెడ్డయ్య,బాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం .వి రమణ, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు పద్మావతి, బాస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్ ,బంజారా సంఘం జాతీయ నాయకులు శంకర్ నాయక్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌస్ బాషా, రజక సంఘం జిల్లా నాయకులు రమేష్, శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు సుధీర్, విద్యార్థి నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం : మంత్రి

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజా దర్బాలో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, నేతలు, ప్రజలు మంత్రిని పుష్పగుచ్చంతో సన్మానించారు.

ప్రజా సమస్యలు వింటున్న మంత్రి

ఘనంగా సౌమ్యనాథుడి చక్రస్నానం

ప్రజాశక్తి - నందలూరు

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత స్వామివార్లకు ఆదివారం అత్యంత వైభవంగా చక్రస్నానం నిర్వహించారు. టిటిడి అధికారుల ఆధ్వర్యంలో ముగింపు ఉత్సవాలు అత్యంత వైభవంగా చేపట్టారు. ముందుగా ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడికి గ్రామోత్సవం వసంతోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉత్సవ మూర్తులకు సుగంధ పరిమళగంధం, పాలు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలాలతో అభిషేకం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, సునీల్ కుమార్, సాయి స్వామి ఉత్సవ మూర్తులకు కోనేటిలో చక్రస్నానం నిర్వహించారు. చక్ర స్నానం అనేది అవదృతం బ్రహ్మోత్సవాలలో ప్రధానమైంది. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.

కోనేటిలో చక్రస్థానం చేయిస్తున్న పూజారులు

మున్సిపల్ కార్మికుల సమ్మె బాట

ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న మున్సిపల్ యూనియన్ కార్మికులు

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న తీవ్రమైన ఆలసత్వాన్ని నిరసిస్తూ మున్సిపాలిటీలో వాటర్, ఎలక్ట్రిసిటీ విభాగాలకు చెందిన ఇంజినీరింగ్ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుండి సమ్మె బాట పట్టారు. సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు కార్మికులకు పూలమాల వేసి దీక్షలు ప్రారంభింపచేశారు. సమ్మెకు సంబంధించిన కరపత్రాల ను కార్మికులతో కలిసి విడుదల చేశారు. సమ్మె ఎందుకు చేస్తున్నామనే వివరాలను కార్మికులు పట్టణ ప్రజానీకానికి వివరించారు. ఈ మేరకు ప్రచార ఆటోను రామాంజులు, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ నెల రోజులుగా తమ సమస్య లను పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ (వాటర్, విద్యుత్) సిబ్బంది అనేక రూపాల్లో ఆందోళన చేస్తున్నారన్నారు. జీవో 36 ప్రకారం జీతాలు పెంచాలని, షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ,పనిముట్లు ఇవ్వాలని , రక్షణ పరికరాలు అందించాలని అనేక మార్లు కింది స్థాయి అధికారి నుండి మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ వరకు విన్నవించినా ఫలితం లేదన్నారు. దీంతో కార్మికులు తప్పనిసరిగా సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. వివిధ డిపార్ట్మెంట్ వారికి (మెప్మా ఆర్ పి, ట్రైబల్ టీచర్స్ గెస్ట్ లెక్చరర్స్) జీతాలు పెంచారని మున్సిపల్ ఏర్పడిన(2005) నాటి నుండి నేటికీ దాదాపు 20 సంవత్సరాలు దాటి పనిచేస్తున్నా కేవలం రూ. 15 వేలు వేతనం ఇస్తున్నారన్నారు. వివిధ రకాల కటింగ్‌లు పోను రూ.13 వేలు వస్తే ధరలు పెరిగిన నేపథ్యంలో కుటుంబ పోషణ తీవ్ర భారం భారంగా మారింది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వెలిగల్లు ప్రాజెక్టు పంప్ హౌస్ పరిధిలో పని చేస్తున్న ఆరుగురు కార్మికు లకు 14 నెలల జీతం ఇవ్వాలన్న కోర్టు ఆదేశాలని సైతం పెడ చెవిన పెట్టి వర్కర్లను మున్సిపల్ అధికారులు వేధిస్తున్నారని చెప్పారు. మెప్మా పరిధిలో పనిచేసిన కాలానికి కొందరికి ఎనిమిది నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. చివరకు ఏడు సంవత్సరాలనుండి ఇంజినీరింగ్ సిబ్బంది జీతాల పెంపునకు నోచుకోలేక పోతుండడం దారుణం అన్నారు. ఖర్చులు పెరిగిపోతున్న నేపథ్యంలో 36 జిఒ ప్రకారం వేతనాలు పెంచేదాకా ఎవరెన్ని ఇబ్బందులకు గురి చేసినా నిరవధిక సమ్మె చేస్తామని జీతాలు సాధిస్తామని పేర్కొన్నారు. మొదటి రోజు ఇంజినీరింగ్ సిబ్బందికి శానిటేషన్ సిబ్బంది మద్దతు పలికారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సిబ్బంది అక్బర్, శంకరయ్య, ఈశ్వర్‌రెడ్డి, మల్లికార్జున, రమణ, రమేష్, రమాదేవి, వెంకటలక్ష్మి, మౌనిక, దేవా, కృష్ణారెడ్డి, బ్రహ్మయ్య,శానిటేషన్ నాయకులు చెన్నయ్య రాంబాబు, మంగమ్మ,సూరి, రామాంజులు, మణి పాల్గొన్నారు

రాజంపేట అర్బన్ : పురపాలికల్లోని వాటర్ సెక్షన్ మరియు ఎలక్ట్రికల్ సెక్షన్ కార్మికులకు వేతనాలు తక్షణమే పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. వాటర్, ఎలక్ట్రికల్ సెక్షన్ కార్మికులకు మద్దతుగా ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పురపాలక కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఏడు సంవత్సరాలు నుండి కార్మికులకు వేతనాలు పెంచకుండా కాలయాపన చేస్తున్నారని, ప్రభుత్వాలు మారినా కార్మికులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్మికుల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి రమణ, గంగయ్య, రమేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న మునిసిపల్ కార్మికులు

అన్నమయ్య డ్యామ్‌ను పరిశీలించిన సాంకేతిక బృందం

వారంలోగా ప్రభుత్వానికి నివేదిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం కోసం ప్రాజెక్టు సాంకేతిక నిపుణులు పోలవరం సి.ఈ రమేష్, జియాలజిస్ట్ రాజు, సిఇసిడిఒ విజయ భాస్కర్, మెకానికల్ ఎక్స్‌పోర్టు సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ, కడప సిఇ శ్రీరామచంద్రమూర్తి బృందం అన్నమయ్య ప్రాజెక్టు, పరిసర ప్రాంతాలలో పర్యటించింది. ప్రాజెక్టు డిజైన్ నిర్మాణం, కార్యాచరణ సవాళ్లను అధ్యయనం చేశారు. నివేదికను వారంలోపు రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని నిపుణులు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి రాగానే పునర్నిర్మాణ పనులు చేపడుతామని చెప్పారు. ప్రాజెక్టు పరిశీలనకు విచ్చేసిన సాంకేతిక నిపుణుల బృందానికి తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు డ్యామ్‌కు సంబంధించిన వివరాలు తెలియజేశారు. ఈసందర్భంగా జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఆరుగురితో కూడిన ఈ నిపుణుల కమిటీ బృందం అన్నమయ్య ప్రాజెక్ట్ ఆనకట్ట తెగిపోయిన ప్రాంతంలో పర్యటించారని తెలిపారు. నిపుణుల బృందం అధ్యాయం చేసిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసి త్వరితగతిన ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి పూర్తిచేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

డ్యామ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నిపుణుల బృందం

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

డిఎంహెచ్ఒ లక్ష్మీనరసయ్య

ప్రజాశక్తి - రాయచోటి

ముఖా ముఖి..

జిల్లాలో ప్రజలందరికి అందుబాటులో ఉండి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాల్లో హెల్త్ సెంటర్ వివరాలు, సిబ్బంది కొరత, ప్రస్తుత వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాల్లో పిహెచ్‌సి, అర్బన్ హెల్త్ సెంటర్ల ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా పిహెచ్‌సిలు 49, యుపిహెచ్‌సిలు 11 ఉన్నాయి.

ప్రస్తుత వ్యాధులు పట్ల ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీజనల్ వ్యాధుల పట్ల రోజూ జిల్లాలో డైలీ రిపోర్ట్ తీసుకొంటున్నాం.(పతి ఇంటికి వెళ్లి జ్వరం వ్యాధిగ్రస్తులను పరీక్షిస్తున్నాం. మలేరియా నిర్ధారణ అయితే దగ్గరిలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నాం. ఐదు రోజులకి మించి జ్వరం ఉన్నట్లయితే డెంగీ పరీక్షలు చేసి నిర్ధారణ అయిన వెంటనే వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పై స్థాయి ఆసుపత్రి కి రిఫర్ చేస్తాం. ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికే వెళ్లి ఇంట్లో లార్వా సర్వే చేస్తున్నారు. నీటి నిల్వలను తొలగించడం, అబేట్ ద్రావణాన్ని చల్లడం, నిల్వఉన్న నీటిపై మూతలు ఉంచడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి శుక్రవారమూ ఫ్రైడే డ్రైడే పాటించాలని ప్రజలకు సూచిస్తున్నారు. వ్యాధి నిర్ధారణమైన గ్రామాలలో వెంటనే యాంటీ లార్వా ఆపరేషన్స్, ఫోకల్ స్ప్రే కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈనెల డెంగీ వ్యతిరేక మాసంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికీ 125 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో, హాస్టల్స్‌లో, ఫోకల్ స్ప్రే కార్యక్రమాన్ని జూన్ నెలలో నిర్వహించారు. యాక్టిబ్ సర్వలిన్స్, పసివ్ సర్విలేన్స్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

సీజనల్ వ్యాధులు అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీజనల్ వ్యాధులలో ముఖ్యంగా వాటర్ బోర్న్ సీజెస్ లైక్ డయేరియా, కలర్స్, డైసెంటరీ, టైఫాయిడ్, జాండిస్ వంటి వ్యాధులు సోకవచ్చు. ప్రజలకు వ్యాధుల పట్ల పర్సనల్ హైజీన్, శానిటేషన్ అవగాహన కల్పిస్తున్నాం. గ్రామ స్థాయిలో వాటర్ క్వాలిటీ టెస్టింగ్ ద్వారా అరికట్టవచ్చు. మనకు ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో 375 విహెచ్‌సి వాటర్ క్వాలిటీ టెస్ట్ ప్రతి బుధవారమూజరుగుచున్నది. ఏదైనా కంటామినేషన్ ఉన్నచో వెంటనే లైన్ డిపార్ట్మెంట్ అయినటువంటి అర్ డబ్ల్యూ ఎస్, పంచాయతీ, మున్సిపాలిటీ డిపార్ట్మెంట్ చెప్పి తగిన పరిష్కారం చేస్తున్నాం.

జిల్లాలో కరోనా కేసులు ఏమైనా నమోదు అయ్యాయా?

జిల్లాలో ఇప్పటివరకు కోవిడ్ కేసులు ఏమీ నమోదు కాలేదు. పక్క జిల్లాలో కేసులు నమోదయ్యాయి. అందులో మన జిల్లాకు సంబంధించిన వారు అక్కడ పనులు చేస్తున్నారు.మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయి.

కోవీడ్ లక్షణాలను ఎలా గుర్తించాలి?

కోవిడ్ లక్షణాలు జ్వరం, షార్ట్నెస్ ఆఫ్ బ్రీత్, చాతిలో నొప్పి, కఫ, కోల్డ్ ప్రభుత్వ చెప్పినట్లుగా ప్రస్తుతం ఒమైక్రాన్ వేరియంట్ అర్‌జే ఎన్ -1, ఎక్స్‌ఎఫ్‌జిఎల్‌ఎఫ్ 7.9. కోవిడ్ టెస్టింగ్ రాట్ (రాపిడ్ అంటిజెన్ టెస్ట్) పాజిటివ్ వచ్చిన వారి,ఇ సస్పెక్టెడ్ పాజిటివ్ వారిని హోం ఐసోలేషన్ ఉండాల ని సూచిస్తున్నాం. పరిశుభ్రత పాటించాలని ఆరోగ్యకరమైన ఆహారం తినాలని చెబుతున్నాం. అర్‌టిఐ, పిసిఆర్ టెస్టింగ్ మాత్రమే కోవిడ్ వ్యాధిని నిర్ధారించవచ్చును.

పాము కాటు కేసులు ఏమైనా నమోదు అయ్యాయా?

గడచిన ఆరు నెలలకు పాము కాటుకు గురైన వారి సంఖ్య 64 మంది పిహెచ్‌సిలకు వచ్చి చికిత్స పొందారు.

జిల్లాలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో ఇప్పటి వరకు ఎనిమిది ఖాళీలు ఉన్నాయి. అవి కూడా రెండు మూడు రోజుల్లో ఫుల్ ఫీల్ అవుతాయి.

ప్రజలకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

దోమ కాటు గురి కాకుండా ఉండాలి. శారీరక, పరిసరాల శుభ్రత తప్పని సరి. రాబోయే వర్షాకాలంలో దోమల ప్రబలకుండా చర్యలు చేపడుతున్నాం. వ్యాధుల నివారణకు దోమతెరలు వాడాలి.

సమావేశంలో మాట్లాడుతున్ననాగూర్ వలి

ఆర్‌టిసి కార్మికుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌టిసి కార్మికుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎపిపిటిడి మదనపల్లె ఆర్‌టిసి-1, 2 డిపోల ఇయు గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌బిఐ కాలనీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు యూనియన్ నాయకు లతో కలిసి కృతజ్ఞత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లా డుతూ ఈనెల 11న ఎంతో సుదీర్ఘ చరిత్ర కలిగినఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ 74వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా మదనపల్లె 1, 2 డిపోల గౌరవాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి నందుకు గర్వంగా ఉందన్నారు. యూనియన్ రాష్ట్ర అధి నాయకత్వం సూచన లు, రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆశీస్సులతో బాధ్యతలు చేపట్టిన తాను ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారి న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. తన ప్రమాణస్వీకారానికి విచ్చేసి జయప్రదం చేసిన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నరసయ్య, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్‌వి.కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాదిక్‌అలీ, మదనపల్లె వన్ డిపో అధ్యక్షుడు జి.మధుసూదన్, కార్యదర్శి ఈశ్వరప్ప, టూడిపో అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్.కె హుస్సేన్, గ్యారేజ్ సెక్రటరీలు రాజశేఖర్, ఎస్.హెచ్ హుస్సేన్, ఎన్.కుమార్, బిసిఎస్ నాయక్, సురేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

31న జిల్లా స్థాయి హిందీ వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న స్థానిక బివిఎన్ పాఠశాలలో ఉమ్మడి కడప జిల్లాస్థాయి హిందీ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31న ప్రముఖ హిందీ నవలాకారుడు ప్రేమ్ చంద్ 146వ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 9 మరియు 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. ప్రేమ్ చంద్‌కి జీవని అనే అంశంపై వ్యాసరచన ఉంటుందన్నారు. ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు ఈ నెల 31న బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. బపూర్తి వివరములకు 6303701314 నెంబర్ కు సంప్రదించవలెనన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు మూడు ఎకరాల భూమి విరాళం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : శ్రీ మల్లికార్జున స్వామి సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నదాన ట్రస్ట్‌కి తంబళ్లపల్లి వాస్తవ్యులు క్రీ,శే. గనముకుల మునెమ్మ, గనముకుల సుబ్బరాయప్ప గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు గనుముకుల శ్రీనివాసులు, మనవళ్ళు గనముకుల శివ రాయుడు, గనముకుల భరత్‌రాయుడు మల్లయ్య కొండ క్రింద అన్నదాన సముదాయానికి దగ్గరలో మూడు ఎకరాల భూమిని అన్నదాన ట్రస్ట్ కి విరాళంగా అందించారు. వారికి అన్నదాన ట్రస్ట్ తరఫున ధన్యవాదాలు తెలిపారు.

15న మల్లయ్య కొండ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు హుండీలో చెల్లించిన కానుక ను మంగళవారం లెక్కిస్తారని ఇఒ మునిరాజా, కొండకిట్టలు తెలిపారు. మూడు నెలల పాటు భక్తులు చెల్లించిన కానుకల హుండీని లెక్కిస్తారన్నారు.

బిటి కళాశాల పూర్వవైభవానికి కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని చారిత్రత్మాక బిటి కళాశాల పూర్వవైభవానికి కృషి చేస్తామని టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని టిఎన్‌ఎస్‌ఎఫ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బిటి కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో ఉన్న నాలుగు ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. బిటి కళాశాల తప్ప మిగిలిన మూడు కళాశాలలో ఎలాంటి సమస్యలు లేకుండా స్వాధీనం చేసుకున్నారని, కానీ బీసెంట్ దివ్యజ్ఞాన కళాశాలను మాత్రం తొందరపాటు చర్యలో భాగంగా కళాశాలను అనెగ్జర్-1 ప్రకారం చేసుకో లేదన్నారు. ఇప్పటికీ కళాశాల భూములను కానీ, భవనాలను కానీ బిటి కళాశాలలో ఉన్న పరిపాలన, ఆర్థికపరమైన రికార్డులను ప్రభుత్వానికి అప్పగించ లేదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పెద్దలు కేవలం నామమాత్రానికి, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అనిబీసెంట్ యూనివర్సిటీ చేస్తున్నామని చెప్పి కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశార న్నారు. యూనివర్సిటీ కావాలంటే యూజీసీ నియమ, నిబంధనల ప్రకారం కళాశాల భూములు, విద్యార్థుల సంఖ్య ఫలితాలు, గ్రూపులు వాటన్నింటినీ పరిగణలోకి తీసుకొన్న తర్వాతనే యూనివర్సిటీ చేయాలా లేదా అనేది యుజిసి నిర్ణయం తీసుకుంటుందన్నారు. వీటన్నింటినీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరి స్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి విఉత్తన్న, ప్రసన్నకుమార్, అఖిల్, నాని, ఆనంద్ రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న బృందం ఆదివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో యోగివేమన, ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయాల్లో అవుట్ సోర్సింగ్ పోస్టులు భర్తీ చేసి ఎటువంటి రోస్టర్ విధానం పాటించకుండా అవినీతి అక్రమాలుకు పాల్పడ్డారని విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో ఉన్న 17 విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి పరిశోధన కేంద్రాలుగా ఉండవలసిన విశ్వవిద్యాలయాలు నిధులు, సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. ప్రొఫెసర్స్, నాన్ టీచింగ్ పోస్టు భర్తీ చేయకపోవడంతో రుసా, యుజిసి నిధులు రాకుండా నిలిచిపోయాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ విశ్వ విద్యాలయాల్లో 14 విశ్వవిద్యా లయాల్లో ఇన్‌ఛార్జిల పాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ విశ్వవి ద్యాలయాల్లో ఇంచార్జ్ పాలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో యోగివేమ , ఆర్కిటెక్చర్ విశ్వవి ద్యాలయాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమీప బంధవువు సురేంద్రనాథ్‌రెడ్డి అనధికారికంగా ఆ ప్రభుత్వ హయాంలో ఆర్కిటెక్చర్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతూ అక్రమ పద్ధతిలో ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా రోస్టర్ పద్ధతి లేకుండా నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు డబ్బులు తీసుకొని అవుట్‌సోర్సింగ్ పోస్టు నియమించారన్నారు. పైఅంశాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్ర మంలో పిడియస్‌యు రాయచోటి నాయకులు రవీంద్ర, శివ, కేశవ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-బి.కొత్తకోట : మదనపల్లి పట్టణంలోని దేవతనగర్‌లోని చైతన్య సర్వీస్ సొసైటీ,ఆనంద వృద్ధాశ్రమాలలో మండలానికి చెందిన గుంతూరు రామాంజులురెడ్డి, భువనేశ్వరిల కుమార్తె గుంతూరు మౌన్విత పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.భాగంగా చిన్నారు సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ,చైతన్య సంస్థ నిర్వాహకులు ఎంపీ ఆనందన్, జనరల్ సెక్రెటరీ కవిత రాణిలు ఇక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారులు, వృద్ధులకు అద్భుత సౌకర్యాలు కల్పిస్తున్నారని కొనియాడారు.

నత్తనడకన ఆర్‌ఓబిల నిర్మాణ పనులు

నిర్మాణంలో ఉన్న ఆర్‌ఓబి పై పనిచేస్తున్న కార్మికులు

- అధికారుల తీరుతో విసిగి పోతున్న స్థానికులు
- రోడ్డు విస్తరణలో రోజుకో కొలత.. నిర్వాసితుల్లో నిండుతున్న నలత
- వాహనదారులకు నరకం చూపుతున్న సర్వీసు రోడ్లు
- కమ్ముకుంటున్న దుమ్ము, ధూళి.. స్థానికుల్లో అనారోగ్య కేళి

చిత్తూరు మార్గంలో భూ వివాదంతో ఆగిన కాలువ నిర్మాణం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పనులు నత్త నడకన సాగుతు న్నాయి. రెవెన్యూ, రహదారులు, భవనాలు, జాతీయ రహదారుల నిర్వహణ శాఖ, గుత్తేదారుల బాధ్యతారాహిత్యం కారణంగా అటు వాహనదారులు, ఇటు ప్రయాణీకులతో పాటు స్థానికులు కూడా విసిగి వేసారి పోతున్నారు. పట్టణంలో చిత్తూరు-కర్నూలు, తిరుపతి - బళ్ళారి జాతీయ రహదారులున్నాయి. ఈ రెండు జాతీయ రహదారులపై రైల్వే లైన్ల క్రాసింగ్ ఉంది. రోజు రోజుకూ పట్టణ విస్తరణ, వాహనాల రాకపోకలు అధికమై ట్రాఫిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రైల్వే క్రాసింగ్లపై ఆర్‌ఒబి నిర్మాణాలు చేపట్టారు. భూసేకరణ చేసి అభివృద్ధి పనులకు సహకరించాల్సిన రెవెన్యూశాఖ దాదాపుగా చేతులెత్తేసింది. ఇంజినీరింగ్ అధికారులు ఆర్డీవోను పలుమార్లు కలిసినా తగిన స్పందన లేదని తెలుస్తోంది. రోడ్డు విస్తరణ పనులకు అవసరమైన మేరకు భూములను అప్పగించని ఫలితంగా గుత్తేదారు నిర్మాణ పనులు నెమ్మదిగా చేయిస్తున్నారు. చేస్తూన్న పనుల్లో ప్రగతి లేకపోవడంతో నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేరకు

ఆర్‌ఒబి నిర్మాణం పనుల చోట ఎగసిడుతున్న దుమ్ము

ఈ రోడ్డు మధ్య సుమారు 50 నుంచి 75 పై ఓవర్లు ఉన్నాయి. వాటి పనులు కూడా పూర్తయ్యాయి. ఒక్క పీలేరు పట్టణంలోని రెండు పై ఓవర్ల పనులు మాత్రం నత్త నడకన సాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా భూసేకరణ, కోర్టు కేసుల్లో బాధ్యతగా స్పందన లేకపోవడం, భూసేకరణ పూర్తికాకుండా, పరిహారం చెల్లించకుండానే ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణం పనులు చేపట్టడంపై తీవ్ర విమర్శలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రతి నిత్యం నిమిషానికి సగటున 10కి పైగా వాహనాలు రాకపోకలు సాగించే ఆయా మార్గాల్లో పక్కా సర్వీస్ రోడ్లు వేయని ఫలితంగా వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన పడాల్సి వస్తోంది. పట్టణ ప్రజలైతే దుమ్ము - ధూళితో అనారోగ్యం పాలవుతున్నారు. ఇక వ్యాపారులు, దుకాణదారులు పడుతూన్న కష్టాలు, అనుభవిస్తూన్న నష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆర్‌ఒబిల నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, భూసేకరణ ఇబ్బందులను అధిగమించడానికి అన్ని చర్యలూ చేపట్టామని, గుత్తేదారుపై ఒత్తిడి పెంచి మదనపల్లె మార్గంలోని వంతెనపై గడ్డర్లు అమర్చే పనులు దాదాపుగా పూర్తి చేయించామని, ఇక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామని రహదారులు, భవనాలశాఖ (జాతీయ రహదారుల నిర్వహణ విభాగం) అధికారులు చెబుతున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కలకడ: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కలకడ

పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికతో కలుసుకోవడం జరిగింది. మండలంలోని పాపిరెడ్డిగారిపల్లిలో ఉన్న జడ్‌పి హైస్కూల్‌లో 1996-97వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ అపూర్వ కలయికతో ఒకచోట చేరి తాము చదివిన విషయాలను నెమరు వేసుకున్నట్లు తెలిపారు. పదవ తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివి ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగి వివిధ ఉద్యోగాలు వివిధ రకాల సంస్థల్లో పనిచేస్తున్న వారు మొత్తం ఒక గూటికి చేరి తాము గతంలో చదివిన రోజులలో చేసిన అల్లర్లు నెమరు వేసుకుని సంతోషంతో గడుపుకోవడం విశేషం. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను, క్రమశిక్షణను అలవాటు చేసుకుని పెద్దలను గౌరవించడం ,మర్యాదగా పలకరించడం వంటి విషయాలను నేర్పిన ఉపాధ్యాయులను దుశ్శాలవాలు, పూలమాలలతో వారిని ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకొని పండుగ వాతావరణంలా పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు కొనియా డారు.ఈ విద్యార్థుల అపూర్వ కలయికలో పాపి రెడ్డి గారి పల్లి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు దండు సయ్యద్‌బాషా, గణితం, సామానుశాస్త్రం ఉపాధ్యాయులు రెడ్డప్పరెడ్డి, నాగభూషణం, భారతి మొదలగు ఉపాధ్యా యులను దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. తాము విద్య నేర్చుకున్న పాఠశాలకు గుర్తుగా తమ వంతు సహకారం అందించాలని ఉద్దేశంతో ప్రస్తుతం పాఠశాలకు రూ.21 వేలు విలువ చేయగల నాలుగు టేబుళ్లను వితరణ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధి కోసం 1996-97 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులు అందరూ కలిసి ఉదార స్వభావంతో సుమారు లక్ష రూపాయలు విరాళంగా ఇవ్వడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు ఎక్కడెక్కడో తమ తమ పనులలో ఉన్నప్పటికీ తాము పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమం చేపడుతున్నామని చెప్పిన వెంటనే మా కార్యక్రమానికి హాజరైన ప్రతి ఉపాధ్యాయులకు మేము ఎప్పటికీ రుణపడి ఉంటామని పూర్వ విద్యార్థులు కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు కలిసి సహపంక్తి భోజనం చేసినట్లు తెలిపారు. **కలికిరి:** మహల్ జిల్లా పరిషత్ హై స్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఎంతో ఘనంగా నిర్వహించారు.1989-90 విద్యాసంవత్సరంలో కలికిరి మండలంలోని మహల్ జిల్లా పరిషత్ హై స్కూల్ (తెలుగు)లో చదివిన పూర్వ విద్యార్థులు, సుదీర్ఘ 35 సంవత్సరాల తర్వాత, నాటి మధుర స్మృతులను నెమరేసుకుంటూ పాఠశాలలో సమావేశ మయ్యారు. బాల్య స్నేహాలను గుర్తుచేసుకుంటూ, మళ్లీ అందరూ ఒకే చోట లో చేరి ఆత్మీయతను పంచుకున్న సందర్భంగా ఈ సమావేశం జరగింది. విద్యార్థులంతా ఒక్కరి కొకరు ఆ సంవత్సరాల్లోని పాఠశాల భవనం పరిస్థితి, విద్యార్థుల అవసరాలు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. భవిష్యత్తులో పాఠశాలకు తమ వంతు సహాయాన్ని అందించాలనే సంకల్పాన్ని వారు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బెంగళూరు రవిచంద్ర, శ్రీనివాసులు, ప్రతాప్ రెడ్డి, వెంకటేశ్వర్లు, షకిల్, అనిల్ కుమార్‌రెడ్డి, నారాయణ స్వామి, వేణుగోపాల్ స్వామి తదితర పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి-రామాపురం

అభివృద్ధి, సంక్షేమ పాలన సిఎం చంద్రబాబుతోనే సాధ్యమని క్రీడామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ చెరువు ముందరపల్లిలో ఆదివారం విలేకరులతో మాట్లా డుతూ దేశంలోనే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడని అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2020 తో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ నగరాలలో ఒకటిగా నిలిపిన నేత ఇప్పుడు స్వర్ణాంధ్ర విజన్ 2047 పేరుతో భారతదేశంలో విభజిత ఆంధ్ర ప్రదేశ్‌ను మొదటి స్థానంలో నిలవడానికి అమరావతిని ప్రపంచ నగరాలలో మేటిగా పనిచేస్తున్నారని అన్నారు. ఏడాది కాలంలోనే 85శాతం హామీలను పూర్తి చేసి రాష్ట్రంలో పి4 నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజులు ఖాదర్‌బాషా, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రమేష్‌రెడ్డి, గాలివీటి సుదర్శన్ రెడ్డి, ఎంఎల్.వెంకటరామిరెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండలంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అదుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి కార్యకర్త ప్రతి ఇంటి తలుపును సందర్శించాలని అన్నారు. పార్టీ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు కలసి కట్టు ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. సుపరిపాలనకు ఇది మొదటి అడుగు మాత్రమే ప్రజల విశ్వాసం గెలుచుకోవడమే మన అసలైన గమ్యమని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లిదీవెన, పించన్లు, అన్నదాత సుఖీ భవ, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను ప్రజలకు అందిం చేందుకు ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోందని అన్నారు. కార్యక్ర మంలో మండల టిడిపి అధ్యక్షులు కకాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాపురం: మంత్రిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సమావేశంలో మాట్లాడుతున్న సుగువాసి ప్రసాద్‌బాబు

తండ్రి ఆశయ సాధనే లక్ష్యం :'సుగవాసి'

ప్రజాశక్తి-సుండుపల్లె

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన తన తండ్రి, మాజీ ఎంపీ కీ.శే. సుగవాసి పాలకొండ్రాయుడు ఆశయ సాధన కోసం పనిచేస్తానని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రానికి సమీపంలోని భైరవగుట్ట వద్ద సుండుపల్లి మండలానికి చెందిన టిడిపి నాయకులు సుగవాసి పాలకొం డ్రాయుడు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాము ఎన్‌టిఆర్ వారసులమని టిడిపి నాయకులు, కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదని అన్నారు. పార్టీ ఆదేశానుసారం పనిచేస్తామని, అలాగని పార్టీకి మోసం చేస్తే పాతేస్తామన్నారు. కష్టపడి పని చేసిన ఏ కార్యకర్త జోలికి వచ్చిన మీ తరఫున నేను ముందుండి పోరాడతానని ఆయన భరోసా ఇచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గంలో టిడిపి ఓటమికి కారణమైన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆదేశానుసారం టిడిపి కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే, కొందరు కోవర్టులు రాజంపేటలో టిడిపిని ఓడించారని విమర్శించారు. టిడిపిలో ఉంటూ పదవులు అనుభవిస్తూ టిడిపిని మోసం చేసిన వారికి పుట్టగతులు ఉండవని అన్నారు. అలాంటి వారికి అధిష్టానం తగిన గుణపాఠం చెబుతుందన్నారు. గ్రూపుల పేరిట టిడిపి కార్యకర్తలకు ద్రోహం చేస్తే బండకేసి కొడతా మన్నారు. రెండు నియోజకవర్గాల్లో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తన తండ్రి ఏ ఆశయంతో పనిచేశారో అందరికీ తెలుసు కానీ ఆయన చివరి రోజుల్లో సుగవాసి కుటుంబానికి కొంతమంది తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాదిమంది సంస్మరణ సభకు తరలిరావడం సంతోషదాయకం అన్నారు. మా తండ్రి మాకిచ్చిన వారసత్వం మీ అందరి అభిమానం అన్నారు. తమకు అండగా నిలిచిన సుండుపల్లి మండల ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి :' యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించాలని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. మన్నూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనసేన నాయకులు కొండేటి రవికుమార్, పివిఆర్ కుమార్ పడత మంచాలు, పరుపులు వితరణ చేయగా ఆదివారం ఆస్పత్రి సిబ్బందికి శ్రీనివాసరాజు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిపై విశ్వాసంతో పేద ప్రజలు వైద్య నిమిత్తం వస్తుంటారని, అలాంటి వారిని ప్రేమగా పలకరించి వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, టిడిపి నాయకులు గుగ్గిళ్ళ చంద్రమౌళి, బాలాజీ, సుధాకర్ రాయల్, వినోద్‌వర్మ, గాజుల కులాయప్ప, పత్తి నారాయణ పాల్గొన్నారు.

ఆస్పత్రికి సిబ్బందికి సూచనలు చేస్తున్న శ్రీనివాసరాజు

ట్రోఫీని అందుకుంటున్న విజేత జట్టు

ఎఫ్‌ఇసిసి ట్రోఫీ క్రాస్ రోడ్ టీమ్ కైవసం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎఫ్‌ఇసిసి క్రికెట్ టోర్నమెంట్ లో సిటిఎం క్రాస్ రోడ్ టీం ట్రోఫీని కైవసం చేసుకుని విజేతగా నిలిచింది. గౌడ సానివారిపల్లి టీం రన్నరప్‌గా నిలిచింది. జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు బండపల్లి అక్కులప్ప కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎఫ్‌ఇసిసి ట్రోఫీని అందజేశారు. ఆదివారం జరిగిన తుది పోరులో సిటిఎం క్రాస్ రోడ్ టీం 135 పరుగులు చేయగా గౌడసానివారి పల్లె టీం 107 పరుగులు చేసి పరాజయం చెందింది. ఈ కార్యక్రమంలో మై ఫోర్స్ డైరెక్టర్ హరిబాబు, వినయ్‌కుమార్, శ్రీరాములు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే ఆలయాలకు మహర్దశ

ప్రజాశక్తి-రాయచోటి

జగన్ హయాంలోనే ఆలయాలకు మహర్దశ కల్గిందని వైఎస్‌ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.సంబేపల్లె మండలం ప్రకాష్ నగర్ కాలనీ గ్రామం నగరిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆదివారం జడ్‌పి మాజీ చైర్మన్ సుగవాసి సుబ్రమణ్యం, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆవుల వేణుగోపాల్ రెడ్డి, మాజీ డిసిసిబి డైరెక్టర్ సేర్ వెంకట్రామిరెడ్డి, వివి ప్రతాప్ రెడ్డి, వాసుదేవ రెడ్డి తదితర నాయకులు తో కలసి శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అపర శ్రీకృష్ణ దేవరాయలుగా మాజీ సిఎం వై.ఎస్.జగన్ పేరొందారని అన్నారు. నియోజక వర్గ వ్యాప్తంగా తిరుమల శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 76 ఆలయాలు మంజూరు చేయించడం జరిగిందని, త్వరలోనే ఆ నిర్మాణ పనులన్నీ పూర్తవుతాయన్నా రు.రాయచోటి లోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ పశ్చిమ రాజగోపురం, మాడ వీధుల నిర్మాణాలు, సంబేపల్లె మండలంలోని శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ తల్లి ఆలయం, శ్రీ గుహేశ్వరి పసుపతినాధ ఆలయం, శ్రీ దేవపట్లమ్మ తల్లి ఆలయం, శెట్టిపల్లె గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, చిన్నమండెం మండలంలోని మండెం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం,మల్లూరమ్మ ఆలయ నిర్మాణాలకు, నియోజక వర్గంలోనిపలు ఆలయాలకు పెద్ద ఎత్తున సి జి ఎఫ్ నిధుల మంజూరుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఆలయాలు నాగరితకు ప్రతీకలని సుగవాసి బాల సుబ్రమణ్యం అన్నారు. ప్రజలందరిలో భక్తిభావం పెంపొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు అంచల రామచంద్ర, అమరనాథరెడ్డి, ఎంపిటిసిలు కాకులపల్లె రమణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లె మల్లికార్జునరెడ్డి, వడ్డీ వెంకట సుబ్బారెడ్డి, ఖగేంద్ర రాజు, మెడికల్ స్టోర్‌అన్నారెడ్డి, స్కూల్ విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

31మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో లయన్స్ కంటి ఆఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 31 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం తో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట,రైల్వే కోడూరు, పీలేరు నియోజకవర్గంలోని కెవిపల్లె, ఎర్రవారిపాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెంలతో పాటు కదిరి, ఎన్.పీ.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 31 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సేవా గుణం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చరణ్‌తేజ కుటుంబానికి విద్యార్థులు, అధ్యాపకుల నుండి పోగుచేసిన రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నీరుగుట్టువారి పల్లి రాంరెడ్డి లేఅవుట్‌లో నివాసముంటున్న హరిబాబు, గీతాంజలిల కుమారుడు చరణ్‌తేజ తలసేమియా వ్యాధితో బాధ పడుతున్నాడనే విషయాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసు కున్నామని అన్నారు. బాలుడి తల్లితండ్రుల ఇబ్బందులను గమనించి తమ వంతు బాధ్యతగా ఆర్థిక సాయం అందించినట్లు తెలి పారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి వారికి అండగా నిలవాలని కోరారు. చిన్నారికి ఆర్థిక సహాయం అందించిన విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శివశంకర్